# పాస్ - ఇంజర్

రోడ్డు రవాణా సంస్థలో వుద్యోగం వచ్చిందనగానే సుబ్బారావు ఎగిరి గంతేశాడు. అతనికిది ఎన్నినాళ్ళదో కోరిక. ఆర్. టి. సి. లో ఉద్యోగం వస్తే హాయిగా ఏడాదికి ఒకసారో, రెండోసార్లో ఎక్కడికి కావాలంటే అక్కడికి భార్య బిడ్డలతో ఫ్రీగా తిరిగిరావచ్చు. అదే అతని ఆశ అందుకే అతనికంత ఉత్సాహం. అతనంత సంబరపడిపోడానికి కారణం లేకపోలేదు. సుబ్బారావు బి. ఏ చదువుతున్న రోజుల్లో అతని రూమ్ పక్కన ఒక ఆర్ టి సి. ఉద్యోగి వుండేవాడు అతను తరుచూ తన సంస్థగురించి, దాని గొప్పతనం గురించి వర్ణించి మరీ చెప్తూ వుండేవాడు. అప్పటి సుబ్బారావు లేత మనసులో ఆర్. టి. సి. మంచి స్థానం ఏర్పరచుకొంది. కాని తీరా అతను ఉద్యోగాన్వేషణలోకి దిగగానే మొదట మున్సిపాలిటీలో క్లర్కుగా ఉద్యోగం వచ్చింది. ఎంత విసుక్కున్నా చేసేదిలేక అందులో చేరినా అతని దృష్టి మాత్రం మారలేదు. తనకి వయసు మించిపోకుండా అందులో కాలు పెట్టాలని మహా ఉత్సాహ పడిపోయాడు సుబ్బారావు. ఎట్టకేలకు తనకి ఇరవై అయిదు సంవత్సరాలు అయిదు నెలల్లో నిండుతాయనగా

యిద్దరు బిడ్డల తండ్రి సుబ్బారావు ఆర్. టి. సి. లో కాలు పెట్టాడు.

సుబ్బారావుకి దేశ సంచారం చెయ్యాలంటే భలే సరదా. అందుకనే అతను ఫ్రీ బస్‌పాస్ గురించి ఎన్నో కలలుకని చివరికి కలలు నిజం చేసుకున్నాడు.

అతను రెండింతల ఉత్సాహంతో ఉద్యోగంలో చేరిపోయాడు చేరిన వెంటనే తెలుసుకున్నాడు ఒక సంవత్సరం సర్వీసు పూర్తయిన తర్వాత తనకి "పాస్" దొరుకుతుందని అతనేం నిరుత్సాహపడలేదు.

అతను చకచకా పనిచేసుకుపోతుంటే పన్నెండు నెలలు, పన్నెండు రోజుల్లా. పన్నెండు గంటల్లా మళ్ళీ మాట్లాడితే పన్నెండు నిమిషాల్లా గడిచిపోయాయి.

o o o

సుబ్బారావు తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాడు ఏ ఏ వూళ్ళలో బంధువులు వున్నారో తను ఫ్రీ పాస్ మీద ఎక్కడికి వెళ్తే బాగుంటుందో అనేది అతనికి సమస్య అయి కూర్చుంది. విశాఖపట్నంలో తన భార్య చెల్లెలుంది. అక్కడికి వెళ్దామంటుందామె కాని పోయిపోయి భార్య తరఫు వారింటికి వెళ్ళడం అతనికి నచ్చలేదు. పోనీ హైదరాబాదే వెళ్దాం అంటే అక్కడ తన పినతల్లి కూతురూ, అల్లుడూ వున్నా వాళ్ళతో తనకి పెద్దగా చనువులేదు. అదీ వదిలేశాడు. చివరికి మద్రాసు రామం దగ్గరకి వేళ్తే బాగుంటుందని పించింది. వాడి పేరూ రామసుబ్బారావే ఇద్దరూ మేనత్త

మేనమామ పిల్లలు. కలిసి అమ్మమ్మగారింట్లో చదువుకున్నారు. తనని సుబ్బారావని వాడిని రామం అని అంతా పిల్చేవారు రామం చాలా మంచివాడు. తనంటే ప్రేమ కలవాడు, మద్రాసులో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. వాడి పెళ్ళికని వెళ్ళినప్పుడు మద్రాసు రమ్మని మరీ మరీ చెప్పాడు. అతని భార్యకూడ సరదా అయిన మనిషి అందుకని మద్రాసు ఖాయం చేసుకున్నాడు. కాని మన రాష్ట్రం కాని మద్రాసుకి మన బస్సులలో "పాస్" యివ్వరని కొంచెం బాధకలిగినా ఎంతవరకు యిస్తే అంతవరకే తీసుకుని ఆ పైన టికెట్ కొనుక్కొని పోవచ్చని కొందరి మిత్రుల సలహామీద నిర్ణయానికొచ్చాడు. మొత్తానికి అన్నీ పరిశీలించుకుని "తడ" అనే ఊరు వరకు "పాస్" పెట్టాడు సుబ్బారావు. ఓ పదిరోజుల ముందుగానే అప్లయి చేద్దామనుకుంటే చుట్టుపక్కల వాళ్ళు ఆతని చేదస్తం చూసి నవ్వి "ఎందుకయ్యా ఒక్క రోజు ముందు చాలు" అంటూ భరోసా యిచ్చారు.

మర్నాటి నుంచి సెలవు పెట్టాడు. రెండవ శనివారంతో కలిసి నాలుగు రోజులు సెలవు దొరికింది. ఈ రోజు రాత్రి బయలుదేరితేగాని అక్కడికి చేరడం, నాలుగూ చూసి తిరిగి రావడం కుదరదు. పది గంటలనుండి సుబ్బారావు ఆఫీసరుగారు ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తూ కూర్చున్నాడు. ఆయన రావాలి. తన పాస్ సంతకం అవ్వాలి. ఆపైన రిజర్వేషన్ - ఇంకా ఎన్నో గొడవలు, అనుభవంలేని సుబ్బారావు ఎక్కువ ఆందోళన పడకపోయినా తోటి గుమాస్తాలు అతన్ని బాగానే గాభరా పెట్టేశారు.

"ఏమోయ్ సుబ్బారావూ! ఈ రోజేనా ప్రయాణం" అని ఒకరు.

"మద్రాసు ఎక్స్‌ప్రెస్సా? అందులో స్టాఫ్‌ను ఎక్కనిస్తారా" అని ఒకరు.

"లేదనుకుంటా - అయినా కనుక్కో- అని మరొకరు పాస్ తీసుకుపోయి ముందుగా రిజర్వు చేయించుకోకపోతే కష్టం" అని ఒకరు పెదవి విరిచారు. "నైట్ ఎక్స్‌ప్రెస్ మీద వెళ్ళడానికి ఆఫీసరు సంతకం మర్చిపోకు లేకపోతే "నాట్ ఎలౌడ్" (నాట్ ఎలౌడ్) స్టాంపుకొట్టి మరీ చేతిలో పెడతారు జాగ్రత్త" అంటూ మరొక శ్రేయోభిలాషి కంగారు పెట్టాడు.

సుబ్బారావు చూసి చూసి విసిగిపోయాడు. ఇంతలో ప్యూను చల్లగా వచ్చి "అసలీవేళ అయ్యగారొస్తారో రారో" అంటూ నసిగాడు ఆ మాటలకి సుబ్బారావు నీరు గారిపోయాడు. రాత్రి ప్రయాణమనీ, రెడీగా వుండమని యింట్లో మరీ మరీ చెప్పాడు. ఆఫీసులో అటూ యిటూ తిరగడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాడు సుబ్బారావు.

మూడు గంటలకి ఆఫీసరుగారు హడావిడిగా ఆఫీసులో అడుగుపెట్టాడు. ఆయన వెనకాల ఎంత లేదనుకున్నా చిన్న బెటాలియన్ వుంది.

ఎప్పుడూ అపశకునం పలికే క్లర్కు- ఒకడు ప్రత్యేకించి సుబ్బారావు దగ్గరికి వచ్చి.

"గురూ, ఈ వేళ సంతకం కాదు ఒకవేళ అయినా నీ కెవరు రిజర్వు చేస్తారోయ్ యిప్పుడు? ప్చ! లాభం లేదు" అంటూ సుబ్బారావు భుజంతట్టి అర్జంటుగా కాఫీకెళ్ళి పోయాడు.

సుబ్బారావుకి ఒక్కసారి విస్పృహ వచ్చేసింది. అతను హాయిగా ఫ్రీ పాస్ గురించి కన్న కలల్లో కొన్ని రంగులు అప్పుడే వెలసిపోయినట్లు అనిపించింది.

మళ్ళీ ప్యూను పరుగున వచ్చి మీా "పాస్" సంతకం అయ్యింది సార్ అన్నాడు - అంతలోనే ఆపీసరుగాగు అర్జంటుగా అందరితోనూ కలిసి వెళ్ళిపోయారు పాస్ చేతిలో పడినా యింకా బోలెడు తతంగం వుంది. నైట్ ఎక్స్‌ప్రెస్ వ్రాయించుకోవాలి. ఆఫీసరుగారు లేరు, సుబ్బారావు పక్క మిత్రుడి సహాయంతో క్రింద ఫ్లోర్‌లో వున్న మేనేజర్ దగ్గరికి వెళ్ళి అతి కష్టంమీాద వ్రాయించుకో గలిగాడు, ఆయన చాల జాగ్రత్తగా "తడ" వరకు అని పాస్‌మీాద నొక్కి వక్కాణించారు.

ఇదంతా పూర్తి చేసుకునే సరికి సాయంత్రం అయిదు గంటలైంది. సుబ్బారావుకి విపరీతమైన తలనొప్పిగా వుంది. అయినా చేసేదిలేక రిజ్వరేషన్ దగ్గరకి బయలుదేరాడు. అక్కడి వాళ్ళు పాస్ అటూ, యిటూ చూసి, కాస్త నసిగి "టి. ఐ. గారిచేత వ్రాయించుకురండి" అన్నారు.

సుబ్బారావు హతాశుడై "మళ్ళీ అదేంటి మేనేజర్ ప్రాశారుగా" అన్నాడు కౌంటర్‌లో ఉన్నతను చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో, ఎంతో జాలి, కొంత హేళన మరి కొంత మర్యాదా అన్నీ వున్నాయి. మొత్తానికి దాని అర్థం మాత్రం" మనకిది కొత్తా" అని మాత్రమే.

అతని కేం చెయ్యాలో తోచలేదు. అన్ని అవస్థలు పడి ఆ మద్రాసు పోకపోతేనేం ? వాళ్ళ నెత్తిన ఎక్కి బాధించకపోతేనేం ? అని నీరసపడిపోయాడు. అయితే తన చేతకాని తనం భార్యదగ్గర వొప్పుకోవలసి వస్తుందని బాధపడి మళ్ళీ ఉత్సాహాన్ని పుంజుకున్నాడు. కౌంటర్‌లో బుకింగు క్లర్కు సుబ్బారావుని చూసి జాలి పడ్డాడులాగుంది.

అదిగో - అక్కడ, హైదారాబాద్ కౌంటర్ దగ్గర బ్లూషర్టు - కళ్ళ అద్దాలు - అటూ చూడండి, ఆయనే టి. ఐ - వెళ్ళి అడగండి - ఫరవాలేదు-మంచివాడు చేస్తాడు లెండి" అన్నాడు.

సుబ్బారావు ఉసూరుమంటూ అటు కదిలాడు. ఆయన ఎవరితోనో మాట్లాడుతుంటే పదినిమిషాలు నిలబడి చిట్ట చివరికి — "సార్ పాస్ రిజర్వేషనే కావాలి - మద్రాసుకి" అన్నాడు. పొడిగా - ఆ టి ఐ. చెళ్ళున ఎవరో యిటు తిరిగి "పాస్‌మీద మద్రాసా" అన్నాడు.

"కాదు సార్" అని ఆ వూరు పేరు మర్చిపోయి మళ్ళీ చూసుకుని "తడవరకు సార్" అన్నాడు.

ఏవేవో ప్రశ్నలు వేసి మొత్తానికి చిన్నగా ఒక పక్కగా ఏదో గిలికి పంపాడు టి. ఐ. తీరా రిజర్వేషన్ చార్టు చూసి అక్కడ క్లర్కు.

"అయ్యో అసలు సీట్లు ఖాళీలేవు సార్" అన్నాడు.

"మరి ఎలాగా" అన్నాను గాలి తీసేసిన బుడగలా చప్పబడిపోతూ సుబ్బారావు.

"మూడు సీట్లు ఎవరో ఆఫీసర్లు పెట్టి వుంచమంటే. వుంచాము. బస్సు కదిలేసరికి మీరు యిక్కడే వుంటే వాళ్ళు రాకపోతే మీరెళ్ళవచ్చు" అన్నాడు.

"వాళ్ళు వస్తే" అన్నాడు సుబ్బారావు అనుమానంగా.

"ఆ....రారులెండి సార్ మీరు రండి చూద్దాం" అన్నాడు. అతనలా ఎందుకన్నాడో బహుశ అతన్ని సృష్టించిన బ్రహ్మకి కూడా తెలీదు. ఇంతలో ఎవరోవస్తే వాళ్ళతో మాట్లాడుతూ కూర్చున్నాడు.

* * *

మద్రాసు బస్సులో సుబ్బారావుకి సీటు దొరకలేదు పన్నెండు గంటలకి పై నుండి వచ్చే బస్సు వుంది. అందులో ట్రై చేద్దాం వుండండి అని అక్కడ అభిమానులు అనగా సుబ్బారావు డీలక్స్ లాంజ్‌లో భార్యా పిల్లలతో కూర్చున్నాడు.

* * *

ఆఫీసంతా గందరగోళంగా వుంది. అందరూ ఏవేవో చర్చించుకుంటున్నారు.

"రియల్లీ ఎ గ్రేట్ ఎఛీవ్ మెంట్" అన్నాడు తారకం.

"ఏమిటి అన్నాడు సుబ్బారావు అర్థంకాక మనవాళ్ళు న్యూయార్క్ - బస్సు వేశారోయ్ - బస్సులు జాతీయం చెయ్యడం అంటే అలాగూ యిలాగూ కాదు మరి" అన్నాడు పార్వతీశం.

"జాతీయం కాదు అంతర్జాతీయం" చమత్కరించాడు పున్నయ్య.

"అమెరికా ?" అన్నాడో క్లర్కు నమ్మలేనట్లు.

"అవును"

"మరి సముద్రాలు ?"

"బ్రిడ్జీలు కట్టిపారేస్తారు"

"నిజం !"

నిజమేనయ్యా - ఇదిగో చూడు కావాలంటే "అయితే మనం పాన్ పెట్టుకుని అమెరికా వెళ్ళవచ్చన్నమాట" ఆంజనేయులు ఆనందంగా.

"అయితే ఒకటి - పాన్‌లు బహుశ న్యూయార్క్ వరకు ఇవ్వకపోవచ్చు" అంటూ సంశయించాడు తారకం.

"రోమ్ వరకు యివ్వొచ్చు అక్కడనుంచి టిక్కెట్టు కొనాల్సి ఉంటుంది."

"అక్కడ నుంచి ఎంత వుంటుందంటావు ?"

"అయినా స్టాఫ్ అంటే రోమ్‌నుంచి తీసుకుపోకపోడు ఎటు తిరిగి న్యూయార్క్ పోవాల్సిన బస్సేకదా. మరీ యిదైన కండక్టరు అయితే తప్ప టికెటు కొట్టడులే."

"అయితే వన్ మ్యాన్ సర్వీసు అయితే మాత్రం కష్టం" అన్నాడు పున్నయ్య.

○ ○ ○

"సార్ మద్రాసు ఎక్స్‌ప్రెస్ వచ్చింది."

సుబ్బారావు ఉలిక్కిపడి లేచాడు చుట్టూ చూశాడు. అది డీలక్స్ లాంజ్ - ఆఫీసూ లేదు - న్యూయార్కూ లేదు - మైక్‌లోంచి ఎనౌన్స్‌మెంటు ఖంగున వినిపిస్తోంది. పిల్లాడిని ఒక చేత్తో, సూట్‌కేసు ఒక చేత్తో పట్టుకుని, చంటివాడి నెత్తుకున్న భార్యని తొందరచేశాడు సుబ్బారావు.

అతని పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. న్యూయార్కుకి బస్సా! చాల్లే! పక్కనున్న మద్రాసుకి పడేపాట్లు చాలక అమెరికా కూడానా అనుకుని కరగిన కల తలుచుకుని నవ్వుకున్నాడు సుబ్బారావు.